క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న ఉభయదాతలు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారికి లక్ష కుంకుమార్చనను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు జరిపించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. లక్ష కుంకుమార్చన పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.10వేలు చెల్లిస్తే, వారి తరపున నలుగురు దంపతులు పాల్గొనవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు.

సిరుల తల్లికి స్వర్ణ పుష్పార్చన

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మి అమ్మవారిని అష్టదళ పద్మాలతో అర్చించారు. బురుజుపేటలో కొలువుదీరిన అమ్మవారిని 108 స్వర్ణపుష్పాలతో పూజించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

4న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 4న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1500 పూజా రుసుం చెల్లించి, దంపతులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

వైభవునికి లక్షమల్లెలతో అర్చన

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీఓస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం లక్ష మల్లెలతో అర్చన నిర్వహించారు. ఉదయం స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వైభవ వేంకటేశ్వరుడికి లక్ష మల్లెలు సమర్పించారు. సాయంత్రం సదస్యోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

14న హనుమజ్జయంతి

డాబాగార్డెన్స్: మెయిన్‌రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 14న హనుమజ్జయంతి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఆ రోజు ఉదయం 5 గంటలకు నాదస్వర కచేరితో ప్రభాత సేవ, 5.30 నుంచి 7.30 గంటల వరకు స్వామికి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామి దర్శనాలు, అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు స్వామి దర్శనాలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ఆలిండియా రేడియో ఆర్టిస్ట్ కొండూరి గాయత్రిచే భక్తిరంజని కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలియజేశారు. అభిషేకాలు, ప్రత్యేక పూజల్లో పాల్గొనే భక్తులు కౌంటర్‌లో రూ.216 చెల్లించాలని తెలిపారు.

సామాజిక భవన నిర్మాణానికి స్థల పరిశీలన



ప్రసాద్‌గార్డెన్స్ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్, జీవీఎంసీ అధికారులు

జగదాంబ: సామాజిక భవనం నిర్మాణానికి కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, జీవీఎంసీ అధికారులు మంగళవారం స్థల పరిశీలన చేశారు. జీవీఎంసీ 35వ వార్డు ప్రసాద్‌గార్డెన్స్ వద్ద ఖాళీగా ఉన్న జీవీఎంసీ స్థలంలో సామాజిక భవనాన్ని నిర్మించాలని ప్రజలు కోరడంతో, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మేయర్ గొలగాని హరివెంకటకుమారికి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన మేయర్ వెంటనే స్థల పరిశీలన చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో ఏఈ తేజస్విని, వర్క్ ఇన్‌స్పెక్టర్లు వచ్చి భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. నివేదికను ఉన్నతాధికారుల ద్వారా మేయర్‌కు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

నగరానికే 'గైస్' గర్వకారణం

మేయర్ హరివెంకటకుమారి



కళాశాల అధ్యాపకులతో మేయర్ హరివెంకట కుమారి



పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

మురళీనగర్: పాలిటెక్నిక్ స్థాయిలో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ నూరు శాతం ఉద్యోగాలు సాధించడం విశాఖ నగరానికే గర్వకారణమని విశాఖ నగర మేయరు గొలగాని హరివెంకటకుమారి అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్)లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఒక ఏడాదిలో 243మంది ఉద్యోగాలు సాధించడం రాష్ట్రంలోనే ఒక రికార్డు కాగా వీరిలో 54మంది బాలికలు ఉండడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా హెచ్‌పీసీఎల్‌లాంటి ప్రభుత్వ రంగ సంస్థలో 85మంది ఉద్యోగాలు సాధించడానికి కృషి చేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. గైస్ విద్యార్థిని డి.వంశీప్రియాంక ఏషియన్ పెయింట్స్‌లో అత్యధిక ప్యాకేజీ రూ.6.73లక్షలు పొందిన మొట్టమొదటి విద్యార్థినిగా రికార్డు సాధించిందని ఆమె ప్రశంసించారు. వీరిని జూనియర్స్ ఆదర్శంగా తీసుకుని ఉన్నత అవకాశాలు పొందాలని ఆమె ఆకాంక్షించారు. తల్లిదండ్రుల ఆశలతో పాటు తమ ఆశయాలు నెరవేర్చుకునేందుకు విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. ఇలాంటి జాబ్ అచీవర్స్ ఉత్సవాలు విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతాయన్నారు. ప్రత్యేక అతిథి 54వ వార్డు కార్పొరేటరు చల్లా రజనీ ఈశ్వరరావు మాట్లాడుతూ తమ వార్డులోని కాలేజీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉద్యోగాల సాధనలో రికార్డు సృష్టించడం గర్వకారణంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ తమ కాలేజీకి ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డుతోపాటు ప్రిన్సిపాల్‌గా గ్లోబల్ అచీవ్‌మెంటు అవార్డు, ఇంటర్నేషనల్ అకడమిక్ లీడర్, గ్లోబల్ ఫ్యాకల్టీ అవార్డులు వచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన 243మందికి మేయరు హరి వెంకటకుమారి, కార్పొరేటరు రజనీ ఈశ్వరరావు నియామక పత్రాలు అందించారు. అనంతరం తల్లిదండ్రులను, ప్రిన్సిపాల్ వెంకటరమణను సత్కరించారు. ముందుగా లవ్ గైస్ లోగోను మేయరు హరివెంకట కుమారి కార్పొరేటరు రజనీ ఈశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎస్‌టీఈ లోకల్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఓ.రామమోహన్‌రావ్, కెమ్‌దోసా అధ్యక్షుడు ఎ.వరహాలు, సభ్యులు డాక్టర్ బోకం దేముడు, యూఎస్ శర్మ, బీఎస్ రామమోహన్, కెమికల్ ఇంజినీరింగు హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఇతర విభాగాల హెడ్‌లు సీహెచ్.జయప్రకాష్‌రెడ్డి, డి.దామోదర్, డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి, ఓఎస్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'బీసీ నేతల్లో అనైక్యతకు కుట్ర'



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

డాబాగార్డెన్స్: బీసీ నేతల్లో అనైక్యత సృష్టించి లబ్ధి పొందాలని కొంత మంది బీసీ నాయకులు చూస్తున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు డబ్బీరు కుమారస్వామి ఆరోపించారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు రాజ్యాధికారం ఇచ్చే పార్టీకి మాత్రమే తమ సంఘం మద్దతిస్తుందని స్పష్టం చేశారు. తమ సంఘం ఏ పార్టీకి చెందింది కాదని, కేవలం బీసీల హక్కుల సాధనకు మాత్రమే పని చేస్తుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వర్షాకాల సమావేశంలో మహిళా బీసీ బిల్లు, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు వారణాసి అన్నాజీరావు, ఒమ్మి ఈశ్వరి, నక్కా పద్మ, వెంకటగిరి, ఆశపు శిరీష, అనురాధ, లక్ష్మి, ఆనంద్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో రాగిజావ పంపిణీ



రాగి జావ పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

జగదాంబ: జీవీఎంసీ 39వ వార్డులో శ్రీస్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మంగళవారం రాగి జావతో పాటు మజ్జిగ, లస్సీ పంపిణీ చేశారు. వేసవిలో ప్రతి ఏటా చలివేంద్రాన్ని కొనసాగిస్తున్నట్టు సంస్థ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నాగమణి, సుజాత, అచ్యుత, ఉమాదేవీ, తదితరులు తెలిపారు.

వెంకన్న ఆలయంలో విశేష హోమాలు



హోమం జరిపిస్తున్న వేదపండితులు

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా దేవస్థానం మండపంలో మంగళవారం విశేష హోమాలు చేశారు. ముందుగా ఆరాధన, నివేదన అనంతరం వేద పండితులు మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా హోమం జరిపించారు.

నేడు వైదిక సదస్యం

కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం వైదిక సదస్యం, వేదపఠనం, శ్రీవారి ఆశీర్వచనం, అర్చన నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు తెలిపారు.

అంతిమ సంస్కారాలకు ఆర్థిక సాయం



మృతుని కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త బూర జయరాజు సోమవారం రాత్రి మరణించారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్, మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి, అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నమగిరి శివదేవి, బమ్మిడి ఫ్రాన్సిస్, వేళంగిణిరావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో మూడు లక్షల ఉద్యోగాలు

మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి



ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు అందిస్తున్న కాయల వెంకటరెడ్డి, గాది శ్రీధర్‌రెడ్డి

మురళీనగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకుంటున్న ప్రత్యేక చర్యల వల్ల రానున్న రెండేళ్లలో రాష్ట్రంలో యువతకు మూడు లక్షల ఉద్యోగాలు వస్తాయని మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి చెప్పారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మంగళవారం నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేవలం పాలిటెక్నిక్ విద్యార్థులకు లక్ష ఉద్యోగాలు వస్తాయన్నారు. విశాఖ పోర్టులోనే 25వేలు ఉద్యోగాలు వస్తాయన్నారు. డిప్లమా విద్యార్థులు కోర్సుల పూర్తి కాగానే వచ్చే ఉద్యోగావకాశాలను వదులుకోవద్దని సూచించారు. తల్లిదండ్రులు వారి పిల్లలు వీలైనంత త్వరగా జీవితంలో స్థిరపడే విధంగా ప్రోత్సహించాలన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ జాబ్ మేళా సలహాదారుడు గాది శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కంపెనీల్లో చేరిన వారు నిబద్ధతతో పని చేస్తే అత్యధిక ప్యాకేజీలు వస్తాయన్నారు. డిప్లమా అనంతరం ఉన్నత విద్యకు వెళ్లడం కన్నా ఉద్యోగాల్లో చేరడం తెలివైన పనిగా ఆయన పేర్కొన్నారు. టాస్క్‌ఫోర్స్ అసిస్టెంటు కమిషనర్ ఎ.త్రినాథరావు మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌ల పట్ల విద్యార్థులు అప్రమత్తతతో ఉండాలన్నారు. ఉద్యోగాలు పొందిన 172 మంది విద్యార్థులకు మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, స్కిల్ డెవలప్‌మెంటు సలహాదారుడు గాది శ్రీధర్‌రెడ్డి నియామకపత్రాలు అందించారు. కార్యక్రమంలో హేమ ఎడోబ్స్ చైర్మన్ బి.సురేష్‌కుమార్, ఎస్‌బీటీఈటీ అకడమిక్ సంయుక్త కార్యదర్శి జీవీవీ సత్యనారాయణమూర్తి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు పాల్గొన్నారు. ముందుగా మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, స్కిల్ డెవలప్‌మెంటు సలహాదారుడు గాది శ్రీధర్ రెడ్డి కాలేజీలోని స్కిల్ హబ్‌ను సందర్శించి శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు.

కార్పొరేటర్ చొరవతో సమస్య పరిష్కారం

జగదాంబ: ప్రధాన కాల్వల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు సిబ్బందికి సూచించారు. వార్డులో పోర్టు వద్ద ఉన్న కాల్వలో చెత్త పేరుకుపోయిందని, స్థానికులు తెలియజేయడంతో ఆయన వెంటనే స్పందించి, తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. జీవీఎంసీ సిబ్బంది కాల్వలో చెత్తను, పూడికను తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వార్డులో ప్రధాన కాల్వలు చెత్త, షిల్ట్‌తో నిండిపోయాయని, జీవీఎంసీ అధికారులు స్పందించి, కాల్వల్లో చెత్తను తొలగించి, మురుగు ప్రవాహానికి అడ్డు లేకుండా చూడాలని కోరారు.

చిన్నారుల పార్కుకు మోక్షమెప్పుడో?



ఇందిరా గాంధీ చిల్డ్రన్ పార్కు ప్రవేశ ద్వారం



రక్షణ గోడలేని పార్కు

బీచ్ రోడ్డు: తీరానికి వచ్చే చిన్నారులతో రోజూ సందడిగా ఉండే ఆ పార్కు గత కొద్ది నెలలుగా వెలవెలబోతోంది. సముద్ర అలలకు కోతకు గురై కొద్ది నెలలుగా మరమ్మతుల కోసం ఎదురు చూస్తోంది. నొవొటల్ ఎదురుగా తీరం చెంతన ఏర్పాటు చేసిన ఇందిరా గాంధీ చిల్డ్రన్ పార్కు కొద్ది నెలల కిందట అలల ఉధృతికి దెబ్బతింది. పార్కు రక్షణ గోడ మొత్తం పడిపోయింది. ఈ సంఘటన జరిగిన చాలా నెలలు కావస్తున్నా జీవీఎంసీ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. దీంతో పార్కులో చిన్నారుల సందడి తగ్గిపోయింది.

బయట హంగులు

జీ-20 సదస్సు కోసం సాగరతీరంలో ఆధునీకకరణ పనులు చేపట్టి అందంగా ముస్తాబు చేశారు. వీటిలో పలు పార్కులను కూడా ఆధునీకీకరించారు. కానీ ఆర్కే బీచ్‌కు సమీపంలోని పిల్లల పార్కును మాత్రం జీవీఎంసీ అధికారులు వదిలేశారు. పార్కు బయట రంగులు వేసి విడిచిపెట్టేశారు. లోపల ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదు. కనీసం రక్షణ గోడ నిర్మాణంపై కూడా దృష్టి సారించలేదు. దీంతో చిన్నారులను పార్కులోకి తీసుకెళ్లడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. కోస్టల్ బ్యాటరీ నుంచి వైఎంసీఏ వరకు రక్షణ గోడ నిర్మాణం, మరమ్మతులు చేపట్టిన జీవీఎంసీ అధికారులు చిన్నారుల పార్కులో మాత్రం ప్రహరీ నిర్మించకపోవడంపై సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కును ఆధునీకీకరించి, సదుపాయాలు కల్పించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పాడైన ఫౌంటెయిన్

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం



ప్రజా దర్బార్‌లో సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీ టాకీస్ వద్ద జరిగిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేకు పలువురు తమ సమస్యలు విన్నవించుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వార్డులో ఇబ్బందులు పడుతున్న పలువురికి ఎమ్మెల్యే సొంత నిధుల నుంచి ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్కేఎంఎల్ దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పటాన్ ఖాజావలీ, మహేష్, సలీం, శ్యామ్‌కుమార్, మోహన్‌సాగర్, వాసు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నేడు రాస్తారోకోలు

డాబాగార్డెన్స్: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రెండేళ్లకు పైగా ఉద్యమిస్తున్నా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తన కుట్రలను ఆపకపోవడాన్ని నిరసిస్తూ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోరుతూ వామపక్షాలు బుధవారం పిలుపునిచ్చిన రాస్తారోకోలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ఓ సంయుక్త ప్రకటనలో కోరారు. రాష్ట్ర కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ పిలుపు మేరకు రాస్తారోకోలకు రాష్ట్రంలోని 10 వామపక్ష పార్టీలు మద్దతు ప్రకటించాయన్నారు. విశాఖ జిల్లా వ్యాప్తంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్న రాస్తారోకోల్లో పెద్ద ఎత్తున ప్రజలు, కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపివేయాలని, ప్లాంట్‌ను పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని, విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

పోస్టల్ సంఘాల గుర్తింపు రద్దు అప్రజాస్వామికం



భోజన విరామ సమయంలో నిరసన తెలుపుతున్న సభ్యులు

డాబాగార్డెన్స్: అర్థం లేని కారణాలతో పోస్టల్ ఉద్యోగ సంఘాల గుర్తింపును కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం అప్రజాస్వామికమని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్, ఆలిండియా బీఎస్ఎన్ఎల్/డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి విడనాడి సంఘాల గుర్తింపును కొనసాగించాలంటూ మంగళవారం డాబాగార్డెన్స్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా యూనియన్ల సభ్యులు మాట్లాడుతూ ఆలిండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ సంఘాలకు పోస్టల్ శాఖలో 70 శాతం పైగా సభ్యుల బలం ఉందని, వాటి గుర్తింపును 5 శాతం బలం కూడా లేని ఓ సంఘం ఫిర్యాదుతో గుర్తింపు రద్దు చేయడం ఏ మాత్రం సమర్థనీయం కాదన్నారు. ఆ రెండు సంఘాల గుర్తింపు రద్దును వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈసీహెచ్‌వీ సాగర్, సురేష్, పెంటయ్య, ఇళ్లపురెడ్డి, శర్మ, మీనాకుమారి, రాధ, మంజుల, గోవిందరావు, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'మా నాయనే.. వెతుక్కుని వచ్చి పెన్షన్ ఇచ్చావా'



ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో సన్యాసమ్మకు పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ బాలాజీ, ప్రగడ వాసు

అల్లిపురం: 'మా నాయనే నన్ను వెతుక్కుని వచ్చి పెన్షన్ ఇచ్చావా' అంటూ పెదవాల్తేరుకు చెందిన సామాజిక పింఛన్ లబ్ధిదారు సన్యాసమ్మ ఆనందం వ్యక్తం చేసింది. నెల రోజుల క్రితం సన్యాసమ్మ కుమారుడిని కాలికి వైద్యం నిమిత్తం టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ సిబ్బంది కేజీహెచ్‌లో చేర్పించారు. రోడ్డు పక్కన చిన్న పరదాతో కట్టుకున్న గుడిసెలో ఉన్న ఆమెను చూసేవారు లేకపోవడంతో ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. ఒకటో తేదీ రావడంతో తనకు పెన్షన్ రాదేమోనని భయపడుతున్న ఆమెకు మంగళవారం ఉదయం ఈస్ట్ పాయింట్ కాలనీ సచివాయం వెల్ఫేర్ సెక్రటరీ బాలాజీ వలంటీర్‌తో వచ్చి ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు సమక్షంలో ఫించన్ మొత్తం రూ.2,750 అందజేశారు. దీంతో సన్యాసమ్మ ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసింది.

ప్రజా మద్దతు పుస్తకాల అందజేత



క్లస్టర్ ఇన్‌చార్జికి పుస్తకాలు అందజేస్తున్న నాయకులు

డాబాగార్డెన్స్: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 31వ వార్డుకు సంబంధించిన ప్రజా మద్దతు పుస్తకాలను వార్డు నాయకుడు బాపు ఆనంద్ ఆధ్వర్యంలో క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డి రామానంద్‌కు మంగళవారం అందజేశారు. 15 మంది కన్వీనర్లు వార్డు పరిధి 5 సచివాలయాల పరిధిలో గృహాలను సందర్శించి, ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా రామానంద్ మాట్లాడుతూ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ నాయకుల సమష్టి కృషితో మెగా సర్వే పూర్తి చేయగలిగామన్నారు. కార్యక్రమంలో కన్వీనర్లు కర్రి ధనలక్ష్మి, శ్రీదేవి, గారి రాంబాబు, కాండ్రేగుల నాయుడు, బాబూరావు, దండ గణేష్, కృష్ణారెడ్డి, పిలక మోహన్, రామారావు, ధోనీ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయనీమణులు

సీతంపేట: నారీ భేరి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక పౌరగ్రంథాలయంలో వైశాఖమాసం వసంతగానం పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించారు. పెమ్మరాజు రామ్, శైలజా మెరాజ్ పాడిన చల్లని గాలి చక్కని తోట, వీవీ చారి, సీవీ రాజేశ్వరి పాడిన ఏదో పిలిచినది, పుండరీకుమార్, భాగ్యలక్ష్మి పాడిన ఇక్కడే కలుసుకున్నాము, వెంకటరెడ్డి, శైలజ పాడిన ఆనందో్బ్రహ్మ, రాజేశ్వరి, నాయుడు పాడిన లలిత ప్రియ కమలం, ఎంవీఆర్ నాగేశ్వరరావు, భాగ్యలక్ష్మి, సీవీ రాజేశ్వరి పాడిన చల్లని రాజా ఓ చందమామ గీతాలు ప్రేక్షకులను అలరించాయి. వీరికి కీబోర్డుపై సోమేష్, తబలాపై బీవీ రమణమూర్తి, ప్యాడ్స్‌పై విజయ్, గిటారుపై నాగు పాటకు తగ్గ వాయిద్య సహకారం అందించారు. ఎంవీఆర్ నాగేశ్వరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో ఎల్.టి. లైన్లు మరమ్మతుల నిమిత్తం ఎస్ఎస్ 141, శ్రీనివాసనగర్ ఏరియా, ఎస్ఎస్ 143, సీతంపేట ప్రాంతం, ఎస్ఎస్ 334, రామాలయం వీధి ప్రాంతంలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఈఈ జి.సత్యనారాయణ కోరారు.